ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 13 జూన్ 2024




## 22న బీసీఐసీ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా

**బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):** అసోసియేషన్ ఆఫ్ పీపుల్ విత్ డిజబిలిటీ (ఏపీడీ), బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నారు. మల్లేశ్వరంలోని మహారాణి కళాశాలలో ఉద్యోగమేళాకు సంబంధించి బుధవారం బీసీఐసీ చైర్మన్ డాక్టర్ దేవరాజన్ మీడియాతో మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేళాను ఏర్పాటు చేశామన్నారు. 50కుపైగా కంపెనీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకుని నేరుగా ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చునని ఏపీడీ సీఈఓ సెంధిల్‌కుమార్ తెలిపారు.

మళ్లీ తెరపైకి

# ముగ్గురు డీసీఎంలు

● తేనె తుట్టెను కదిపిన మంత్రి రాజణ్ణ ● వంతపాడుతున్న మరికొందరు ● డీకే వర్గీయుల అసంతృప్తి



సహ కారశాఖ మంత్రి రాజణ్ణ

**బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో విభేదాలు కొత్త కాకపోయినా లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే ఓ అంశం తెరపైకి వచ్చింది. మూడు డీసీఎంలు ఇవ్వాలని సహకారశాఖ మంత్రి రాజణ్ణ రెండు రోజుల క్రితం చేసిన ప్రస్తావన హల్‌చల్ చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసింది. ప్రభుత్వం ఏర్పడినప్పుడే ఒకే ఉపముఖ్యమంత్రి సరికాదని, సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ వచ్చింది. అధిష్టానం అవకాశం ఇవ్వలేదు. ఆరునెలల కిందట మరింతమంది డీసీఎంలు అవసరమని పలువురు డిమాండ్ చేశారు. పలు కారణాలతో వాయిదాలు పడ్డాయి. లోక్‌సభ ఎన్నికల వేళ ముగ్గురు డీసీఎంలు చేయాలని సీనియారిటీ, సామాజిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సహకారశాఖ మంత్రి రాజణ్ణ డిమాండ్ చేశారు. ఎన్నికలవేళ డీసీఎం పోస్టుల కుంపటి కదపడం సరికాదని, పెను ప్రభావం చూపుతుందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర నేతలకు హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఎవరూ ఇలాంటి అంశాలు మాట్లాడరాదని అల్టిమేటం జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో మంత్రి రాజణ్ణ ఇదే అంశాన్ని తెరపైకి తెచ్చారు. ముగ్గురికి ఉపముఖ్యమంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ఇందులో దళిత, ముస్లిం, లింగాయత లేదా బీసీ వర్గాలలో ఒకరికి డీసీఎం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెరపైకి తెచ్చింది మంత్రి రాజణ్ణ అయినా పలువురు ఆశావహులు ఇందుకు బలం చేకూరేలా మాట్లాడుతున్నారు. దళిత సామాజికవర్గంలో పరమేశ్వర్‌కు అవకాశం దక్కనుంది. గతంలోనూ పరమేశ్వర్ డీసీఎంగా వ్యవహరించారు. ఇక లింగాయత సామాజికవర్గమైతే ఎంబీ పాటిల్ లేదా హెచ్‌కే పాటిల్‌లో ఒకరికి దక్కే అవకాశం ఉంది. మైనారిటీలలో మంత్రి జమీర్ అహ్మద్‌కు చాన్స్ ఉండొచ్చు. ఇక ఎస్టీ సామాజికవర్గంలో సతీశ్‌జార్కిహోళికి అవకాశం దక్కే వీలుంది. సీఎం బీసీ సామాజికవర్గానికి చెందినవారు కావడంతో అవకాశం ఇవ్వకపోవచ్చు. డీసీఎంల సంఖ్య పెంచాలనే ప్రతిపాదనపై అనుకూల, వ్యతిరేక వాదనలు జోరందుకుంటున్నాయి. డీసీఎంల సంఖ్య పెంచాలనే అంశానికి డీసీఎం డీకే శివకుమార్ వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం, ఎన్నికల్లో ఎవరు ఏమైనా కష్టపడ్డారో వారు డిమాండ్ చేస్తే బాగుంటుందనే అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. అందుకు దీటుగానే ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన డీసీఎం డీకే శివకుమార్ ఉన్నా తమ్ముడిని గెలిపించుకోలేకపోయారని, ప్రత్యేకించి మైసూరు ప్రాంతంలో ఒక్కలిగ ఓట్లు సాధించడంలో విఫలం చెందారనే విమర్శలు పెరుగుతున్నాయి. పైగా ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన మంత్రులు కృష్ణబైరేగౌడ, చలువరాయస్వామి, వెంకటేశ్, సుధాకర్ వంటివారు ఉన్నా ఓట్లు పెంచలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. ఇలా మంత్రులు, కాంగ్రెస్ ముఖ్యుల మధ్యనే విమర్శలు పెరుగుతుండడం సర్వత్రా ఆందోళనకు కారణమవుతోంది. డీసీఎం హోదాలు డిమాండ్ చేసేవారిలో సీఎం వర్గీయులే ఉన్నారని డీకే శివకుమార్ అనుచరులు మండిపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 20 సీట్లు విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా 9 స్థానాలకే పరిమితమయ్యారు. ఓటమికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులను బాధ్యులు చేయాలని స్వయానా రాహుల్‌గాంధీ హెచ్చరించిన తరుణంలోనే డీసీఎంల అంశం తెరపైకి రావడం మరో వివాదానికి కారణమవుతోంది. ఇదే తరహాలో ఆరోపణలు చేసుకుంటే త్వరలో జరగనున్న బెంగళూరు పాలికెతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు లేకపోలేదు.





## పేదల కడుపు నింపేశాఖ దక్కింది

● కేంద్ర పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి జోషి



**బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):** దేశంలో నిరుపేదల కడుపు నింపే శాఖ దక్కడం సంతోషంగా ఉందని కేంద్ర పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి పేర్కొన్నారు. ఢిల్లీలో మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సొంతూరు హుబ్బళ్లికి వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనపై నమ్మకంతో కీలకమైన బాధ్యత అప్పగించారని అన్నారు. అందుకు తగ్గట్టుగానే పేదలు ఆకలితో లేకుండా చేసే బాధ్యత తనపై ఉందన్నారు. దేశవ్యాప్తంగా అన్నదాతలు, మరోవైపు పేదలకు అనుబంధమైన శాఖ అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోతున్న తరుణంలో రైతులు సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్నారని, కనీస మద్దతుధర దక్కేలా ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. దేశభవిష్యత్తు దృష్ట్యా ఆధునికీకరించిన విద్యుత్‌శాఖ కీలకమైనదని అన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరులను ఆధునికీకరిస్తామన్నారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి 10కిలోల బియ్యం ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపినా నిర్లక్ష్యం చేశారనే అంశంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. వాస్తవ పరిస్థితిని వ్యవసాయ ఉత్పత్తుల గణాంకాలను సేకరించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



వర్షపు నీటిలో హంపి ప్రతిబింబాలు

## వర్షంలో హంపి ప్రతిబింబాలు

**కంప్లి, జూన్ 12 :** గత రెండు మూడు రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. హంపి పుణ్యక్షేత్రంలో కూడా నిరంతరంగా వర్షాలు కురుస్తున్నాయి. పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా వాటిని లెక్కచేయకుండా పలు ప్రాంతాలను దర్శించుకుంటున్నారు. వర్షం రాకతో హంపి అందాలు మరింత ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. చుట్టు పక్కల ప్రకృతి పచ్చదనం పరచుకోవడంతో పాటు వర్షంలో వాటి అందాలు రెట్టింపవుతున్నాయి. వర్షపు నీటిలో హంపి ప్రతిబింబాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విరుపాక్షేశ్వరస్వామి ఆలయ గోపురం, విజయవిఠల దేవస్థానం, మండపాలు, ఆలయాలు విద్యుత్ కాంతులతో పర్యాటకులను మంత్రముగ్దులను చేస్తున్నాయి. కంప్లి నియోజకవర్గంలో ఎడాపెడా వర్షాలు కురుస్తున్నాయి. నీటి కుంటలు, పొలాలు ఏకమయ్యాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రాత్రి వేళల్లో జాగ్రత్తలు వహించాలని, పాత మిద్దె ఇళ్లు వున్న చోట వుండరాదని సూచించారు.



# జూలై ఆఖరు వరకు ఓటీఎస్‌కు అవకాశం

● బీబీఎంపీ పరిధిలో రాత్రి 10వరకు పార్కులు ● బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్

**బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):** ఆస్తి పన్ను చెల్లించనివారికి బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) ఇస్తున్న వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను జూలై ఆఖరు వరకు మాత్రమే ఉంటుందని, మళ్లీ పొడిగించేది లేదని బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. విధానసౌధలో బీబీఎంపీకి సంబంధించి అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పన్ను బకాయి ఉన్నవారు గడువులోగా చెల్లించాలని డీకే శివకుమార్ వెల్లడించారు. ఎన్నికల వేళ పన్నులకు సంబంధించి బీబీఎంపీపై ఒత్తిడి తేలేదన్నారు. ప్రస్తుతం జరిమానాలో 50శాతం రాయితీ ఇస్తున్నామని, వందశాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్టు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఆత్రుతగా అమలు చేసిన చట్టాన్ని తమ ప్రభుత్వం సరిచేస్తోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజధానిలో 20 లక్షల కట్టడాలు ఆస్తిపన్ను పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 8.6లక్షల మంది పన్ను చెల్లించారని తెలిపారు. రూ.5,200 కోట్లు పన్నుల లక్ష్యంగా ఉండగా ఇంతవరకు రూ. 1,300 కోట్లు సేకరణ సాధ్యమైందన్నారు. కాగా, పన్నుల పరిధిలో లేని వారిని ఇందులోకి తెచ్చేందుకు అవకాశం కల్పించామన్నారు. పన్ను చెల్లించి రసీదు చూపితే తగిన ఖాతా కేటాయించనున్నట్టు డీకే శివకుమార్ వెల్లడించారు. 20 లక్షల ఆస్తులకు సంబంధించి రికార్డులను డిజిటలీకరణ చేస్తున్నామని, ఇప్పటివరకు 8లక్షల ఆస్తులు చేసినట్టు పేర్కొంటూ మరో మూడు నెలల్లో మిగిలిన ఆస్తులను కూడా డిజిటలీకరణ చేయనున్నట్టు తెలిపారు.

### రాత్రి 10 గంటల వరకు పార్కులు

బెంగళూరు నగర పాలికె పరిధిలోని ఉద్యానవనాలు నిర్దిష్ట సమయంలో తెరిచి ఉంటాయని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ప్రజలు మధ్యాహ్నం కూడా ఉద్యానవనాలను తెరవాలని విన్నవించడంపై సానుకూలంగా స్పందిస్తూ.. వేకువజామున 5 గంటలనుంచి రాత్రి 10 గంటల వరకు పార్కులు తీసేలా నిర్ణయించినట్టు తెలిపారు. పార్కులలో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా పోలీసులు, మార్షల్స్ గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అలా అమర్చిన నిర్వాహకులతోపాటు ఏఆర్‌ఓపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డీసీఎం ఆదేశించారు. అనధికార ఫ్లెక్సీలకు సంబంధించి ప్రజలు హెల్ప్‌లైన్ 1553కు ఫిర్యాదు చేయవచ్చునని, వాట్సాప్ 94806 83939 ద్వారా ఫొటో, చిరునామాను పంపవచ్చు అన్నారు.

### పచ్చదనానికి ప్రాధాన్యం

ఉద్యాన నగరి బెంగళూరుకు పూర్వవైభవం తెచ్చేలా పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. మెపథాన్ కార్యక్రమం ద్వారా ఎక్కడ మొక్కలు నాటే అవకాశం ఉందో గుర్తిస్తామన్నారు. ప్రయోగాత్మకంగా బొమ్మనహళ్లి డివిజన్‌లో చేపట్టామని, ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. బ్లూగ్రీన్ పేరిట అభియాన చేపట్టామని, ఇందుకు క్లైమేట్ యాక్షన్ సెల్ కూడా ఏర్పాటు చేశామని వివరించారు. హసిరు రక్షకలో భాగంగా ఈ సంవత్సరం మరిన్ని పాఠశాలను చేర్చి రెండు లక్షల మొక్కలు నాటే లక్ష్యం కల్గినట్టు తెలిపారు. కనీసం ప్రతి ప్రధానోపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయులు 3-4 మొక్కలను నాటి సంరక్షించాలని, ఇందుకు పిల్లలు కూడా చొరవ చూపాలన్నారు. బీబీఎంపీలోని డివిజన్‌లవారీగా చెట్ల గణనకు సంబంధించి టెండరు పిలిచామన్నారు. బొమ్మనహళ్లి డివిజన్‌లోని విద్యాపీఠ, కత్తిరిగుప్పె వార్డుల్లో ఇప్పటికే 94వేల చెట్లు చేరాయన్నారు.



## టీడీపీ అభిమానుల సంబరాలు

**బాగేపల్లి, జూన్ 12:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కమ్మవారిసేవా ట్రస్టు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి లడ్డూ పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కేఆర్ రామచంద్రనాయుడు మాట్లాడుతూ సరిహద్దులోని బాగేపల్లి తాలూకాకు కృష్ణానది నీటిని అందించాలని కోరనున్నట్టు తెలిపారు. డీసీఎంగా పవన్‌కల్యాణ్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి బీఆర్ నరసింహనాయుడు, పురసభ సభ్యురాలు సుజాత నాయుడు, ట్రస్టు కార్యాధ్యక్షుడు కేసీ వెంకటరవణప్ప, ఉపాధ్యక్షుడు ప్రభాకరనాయుడు పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న అభిమానులు



తుషార్ గిరినాథ్ బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమాశంకర్

## బీబీఎంపీ కమిషనర్‌గా ఉమాశంకర్ బాధ్యతలు

**బెంగళూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి):** బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) 29వ కమిషనర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి ఉమాశంకర్ బాధ్యతలు చేపట్టారు. ఉమాశంకర్‌కు వివిధ శాఖల్లో పనిచేసిన అనుభవం ఉంది. కేఎస్ఆర్టీసీ చైర్మన్‌గా వ్యవహరించిన అవధిలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చేందుకు కారకులయ్యారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ బదిలీ నేపథ్యంలో బుధవారం ఆయన నుంచి బాధ్యతలు స్వీకరించారు.



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1,577.82 | 1,581.04 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 517 | 889 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 05 | 227 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 3.50 | 5.00 |

## నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

**బళ్లారి సిటీ, జూన్ 12:** జిల్లా ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, స్టూడియో యజమానుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నుంచి నాలుగు రోజులపాటు స్థానిక కంటోన్మెంట్‌లోని విమ్స్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు నాడగౌడ చంద్రశేఖర్ తెలిపారు. నారాయణ రావు పార్కులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆహ్వాన పత్రికను సంఘం అధ్యక్షుడితో పాటు సభ్యులు విడుదల చేసి మాట్లాడారు. ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఏడాది పొడవు బిజీగా ఉంటారని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు గోపాల్, సభ్యులు శ్రీధర్, మల్లికార్జున, ఖాదర్‌భాష, వీరేశ్, రమేశ్, సుభాన్,లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిద్ధివినాయక రజతోత్సవం



విశేషాలంకారంలో సిద్ధి వినాయకస్వామి

**బళ్లారి సిటీ, జూన్ 12:** హొసపేట పట్టణంలోని సిద్ధి వినాయక ఆలయ రజతోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ సమితి అధ్యక్షులు రాఘవేంద్ర శెట్టి తెలిపారు. బుధ, గురువారాలు రెండురోజు పాటు పెద్దఎత్తున ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బుధవారం సాయంకాలం స్థానిక కళాకారులచే భరత నాట్య ప్రదర్శన జరిగింది. స్వామివారికి గురువారం ప్రత్యేక అలంకరణ, గణపతి హోమం నిర్వహిస్తారన్నారు. కొట్టూరు మఠం ముప్పిన బసవలింగ స్వామి నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మూతబడిన చికెన్ కబాబ్ అంగళ్లు



మూతబడిన చికెన్‌కబాబ్ వ్యాపారస్తుల తోపుడు బండ్లు

**బళ్లారి గాంధీనగర్, జూన్ 12:** నగరంలోని సంగం సర్కిల్‌లో చికెన్ కబాబ్ వ్యాపారం చేస్తున్న పుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్ళుగా చికెన్ కబాబ్ వ్యాపారం చేస్తున్న వారిపై ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు రావడంతో వ్యాపారులను అక్కడనుంచి తరలించాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించడంతో వారి ఇబ్బందులు ఎక్కువయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే భరత్ రెడ్డి నగరంలో ప్రధాన సర్కిళ్ళను అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో నగరంలోని సర్కిళ్ళను సందర్శించి ప్రస్తుతం సంగం సర్కిల్‌లోని పుట్‌పాత్ వ్యాపారులను పాత కోర్టు ఎదురుగా ఉన్న ప్రాంతానికి తరలించాలని నిర్ణయించారు. ఆ ప్రాంతంలో వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. దీంతో అంగళ్లను మూతవేసి వారు నిరసన తెలుపుతున్నారు. తమను అక్కడ నుంచి తరలించరాదని వ్యాపారస్తులు కోరుతున్నారు.

## సిరుగుప్పలో భారీ వర్షం

**సిరుగుప్ప, జూన్ 12 :** సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో మురుగువాడల ప్రాంతాల్లో నీరు పొంగి ప్రవహిస్తోంది. సిరుగుప్పలో వర్షం వల్ల రోడ్లన్నీ జలమయమై చిత్తడిగా మారాయి. ప్రధానంగా వేదావతి నదికి వర్షపునీరు అధికంగా రావడంతో నది పొంగి పొర్లుతోంది. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు.

# మేయర్, ఉపమేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

- 21 న ఎన్నికకు షెడ్యూల్ విడుదల
- మార్చి 28తో ముగిసిన మేయర్ పదవీ కాలం




**బళ్లారి, జూన్ 12(ఆంధ్రజ్యోతి):** బళ్లారి నగర పాలికె మేయర్, ఉపమేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల అయింది. ఈ నెల 21న బళ్లారి నగర పాలికె సమావేశ భవనంలో ఉదయం 11.30 గంటలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు కలబురిగి రెవెన్యూ డివిజినల్ ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. మేయర్ సీటు జనరల్‌కు, ఉపమేయర్ స్థానం బీసీ- ఏ క్యాటగిరీ మహిళకు రిజర్వ్ అయినట్లు తెలిపారు. బళ్లారి నగర పాలికెలో మొత్తం 39 మంది కార్పొరేటర్లు ఉండగా, ఇందులో బీజేపీకి 13 మంది, కాంగ్రెస్‌కు 26 మంది ఉన్నారు. మొదట్లో ఇండిపెండెంట్‌గా గెలిచిన ఐదుగురు కార్పొరేటర్లు ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు.

**ఆరు నెలలు మేయర్ ఎన్నిక జరపకుండానే...**

22వ అవధి మేయర్ పదవీ కాలం ఎస్సీ మహిళకు రిజర్వేషన్ అయింది. ఆ అవధిలో 4వ వార్డు నుండి ఎన్నికైన త్రివేణి మేయర్‌గా ఎన్నికయ్యారు. ఏడాది కాలం పూర్తి కాకుండానే ఆమె ఆరు నెలలకే 2023 నవంబరు 1న రాజీనామా చేశారు. తరువాత 6 నెలల కాలానికి నవంబరు 28న ఒకసారి, అలాగే డిసెంబరు 19న మరోసారి నోటిఫికేషన్ జారీ చేశారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉండే గ్రూపుల రాజకీయం కారణంగా ఆరు నెలల కాలం మేయర్ ఎన్నిక కాకుండానే జరిగిపోయింది. ఇంతలో ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చేశాయి. ఎన్నికల కోడ్ అనే నెపంతో ఈ ఆరు నెలలు గడిచిపోయింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా మేయర్ ఎన్నికల్లో కాలం వృథా చేయడం అత్యంత అనాలోచితం అని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**మేయర్ పదవికి అతిరథ మహారథుల పోటీ**

ప్రస్తుత మేయర్ సీటు జనరల్‌కు రిజర్వు అయింది. ఈ సారి అతిరథ మహారథులు పోటీలో ఉన్నారు. 18వ వార్డు కార్పొరేటర్ ముల్లంగి రవీంద్రబాబు కుమారుడు ముల్లంగి నందీష్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నుంచి ముండ్లూరు ప్రభంజన్ కుమార్ పోటీపడుతున్నారు. అప్పట్లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రభంజన్‌కు కాంగ్రెస్ పార్టీ నుండి బీ-ఫారం దక్కలేదు. అయిన ఆయన ఇండిపెండెంట్‌గా ఎన్నికల్లో పోటీ చేసి తన కుటుంబం సత్తా ఏమిటో నిరూపించారు. ఇప్పుడు ఈ ఇద్దరూ మేయర్ పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

**నేడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం**

బళ్లారి మేయర్, ఉపమేయర్ ఎన్నికపై గురువారం గాంధీనగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయలో కార్పొరేటర్లతో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచారం.

# భారీ వర్షంతో బళ్లారి అస్తవ్యస్తం

- నీట మునిగిన నగర దారులు
- మూడు అండర్ బ్రిడ్జిల్లో భారీగా నీటి చేరిక
- స్తంభించిన వాహన సంచారం



నీటమునిగిన పాత తహసీల్దారు కార్యాలయం ప్రాంగణం

**బళ్లారి గాంధీనగర్, జూన్ 12:** రెండురోజులుగా ఎడతెరపి లేకుండా వాన కురుస్తుండంతో నగర జనజీవనం అతలాకుతలమయింది. బుధవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ప్రారంభమైన వర్షం ఏకదాటిగా కురుస్తున్నందున నగరంలోని రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రజలు రోడ్లు దాటడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

బళ్ళారి నగరాన్ని వేరుచేసే రైల్వే ట్రాక్ క్రింద నిర్మాణమైన దుర్గమ్మగుడి అండర్‌పాస్, సత్యనారాయణ పేట అండర్‌పాస్, రంగమందిరం వద్ద నిర్మాణమైన అండర్‌పాస్‌లలో భారీగా వర్షపు నీరు చేరడంలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. నగరంలో ప్రధానంగా గాంధీనగర్, పార్వతినగర్, కప్పగల్లు, తాలూరు రోడ్డు ప్రాంతాలకు చెందిన ప్రజలు, వాహనదారులు రాయల్ సర్కిల్ వైపు రావడానికి దుర్గమ్మ గుడి అండర్‌పాస్ ఒక్కటే మార్గం కావడంతో ఆవైపు వెళ్ళే వాహనాలు సత్యనారాయణపేట వద్ద ఫ్లైఓవర్‌పై నుంచి రావాల్సి రావడంతో ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బుధవారం సాయంత్రం స్కూళ్ళు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు పనివేళలు ముగిసిన సమయంలో వర్షం రావడంతో ఒక్కసారిగా నగరంలో ట్రాఫిక్ పెరిగిపోయింది. ప్రధాన రోడ్లు అన్ని వాహనాలతో నిండిపోయాయి. డ్రైనేజి కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు బళ్ళారి ఏపీఎంసిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షం నీరు ఎటువెళ్ళలేక పల్లపు ప్రాంతంలో నిలచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పంటలు తడిసి ముద్దయ్యాయి.

**బళ్లారి (ఆంధ్రజ్యోతి):** వర్షాల కారణంగా కూరగాయల మార్కెట్ మూత పడింది. పూలు, ఆకు కూరలు, కూరగాయలు కొనుగోళ్లకు జనం బయటకు రాలేదు. దీని కారణంగా నష్టపోయామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వాన తో పశువులు మేతకు వెళ్లలేదు. మేకలు, గొర్రెల మందలు దొడ్డిలోనే ఉండిపోయాయి. దాదాపు 15ఏళ్ల తరువాత ఇంత పెద్ద వానలు కురుస్తున్నాయని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, రెయిన్ ఫాల్ డేటా రికార్డు అధికారులు పేర్కొన్నారు. తుంగభద్ర, వేదావతి, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని అధికారులు హెచ్చరించారు.



నీటమునిగిన ఏపీఎంసీ రోడ్లు



పొంగిప్రవహిస్తున్న కాకర్లతోట వాగు



పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నీటి మడుగు

# వర్షపునీటిలో వాహనదారుల ఇబ్బందులు



వర్షంలో విద్యార్థుల అవస్థలు



వాహనదారుల ఇబ్బందులు



సండూరులో నీటమునిగిన మొక్కజొన్న పంట

**బళ్లారిరూరల్, జూన్ 12 :** జిల్లాలోని బళ్లారి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి వరకు కురుస్తున్న భారీ వర్షంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం మధ్యాహ్నం నుండి వర్షం కురుస్తుండటంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. అదేవిధంగా మోకా, రూపనగుడి, చేళగుర్కి తదితర ప్రాంతాల్లో అత్యధికంగా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లోని వాగులు, వంకలు ఉప్పొంగడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

**సండూరులో వర్షం**

**తోరణగల్లు, జూన్ 12 :** సండూరు తాలుకాలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అందులో భాగంగానే సండూరు హుబలిలో 27.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా, చుర్నూరు హుబలిలో 12.6 మిల్లీమీటర్లు, కురేకుప్ప ప్రాంతంలో 33.0 మిల్లీమీటర్లు, విఠలాపురంలో 16.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మంగళవారం కురిసిన వర్షానికి సండూరు తాలుకా సిల్లియప్పహళ్లి గ్రామానికి చెందిన శివ నాయక అను రైతు 2.40 ఎకరాలలో వేసిన మొక్కజొన్న పంట దెబ్బతింది. దీనికి సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని అధికారులు తెలిపారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో అంబరాన్నంటిన సంబరాలు



ఏపీ సీఎంగా ప్రమాణంచేస్తున్న చంద్రబాబునాయుడు

**సిరుగుప్ప, జూన్ 12 :** చంద్రబాబు నాయుడు నాల్గవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. టపాసులుపేల్చారు. స్వీట్లను పంపిణీ చేశారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి కృషిచేయాలని చంద్రబాబును కోరారు.

## వైభవంగా ఎర్రితాత మహారథోత్సవం



చేళగుర్కి ఎర్రితాత రథాన్ని లాగుతున్న భక్తులు

**బళ్లారిరూరల్, జూన్ 12 :** తాలూకాలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో చేళగుర్కి ఎర్రితాత మహారథోత్సవాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో ఇటు కర్ణాటక, అటు ఆంధ్రలోని భక్తాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భారీగా వర్షం కురుస్తున్నప్పటికీ స్వామి వారి రథాన్ని ఆలయ ప్రాంగణం నుంచి ఎదురు బసవన్న దేవస్థానం వరకు లాగి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ రథోత్సవంలో వేల సంఖ్యలో భక్తాదులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు బహూకరిస్తున్న సత్యనారాయణ

**కంప్లి, జూన్ 12 :** సత్య అరుణోదయ సేవా సమితి ఆధ్వర్యంలో బాలికల ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యార్థులకు సుమారు వంద ప్లేట్లను సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తమ వంతుగా విద్యార్థులకు భోజన ప్లేట్లు అందించామన్నారు. విద్యార్థులు దీక్ష, పట్టుదల వుంటే దేన్నయినా సాధించవచ్చునని అన్నారు. ఉపాధ్యాయులు కల్పించే విద్య ద్వారా విద్యార్థులు శిక్షణ పొంది అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ



రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కంప్లి, జూన్ 12 :** నరేంద్రమోడీ మూడవ సారి ప్రధాని మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో పాటు గాలి లక్ష్మీఅరుణ పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొడిదల రాజు మాట్లాడుతూ గాలి లక్ష్మీ అరుణ రానున్న కాలంలో రాజకీయ పరంగా, అభివృద్ధి పరంగా ముందడుగు వేస్తూ తమ నాయకుడు గాలి జనార్దన్ రెడ్డితో పాటు పేరు పొందతారని తెలిపారు. మరిన్ని పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని రాష్ట్రంలో మరింత గుర్తింపు పొందాలని అన్నారు. వారితో పాటు జ్యోతి, ధనుంజయ, సురేష్, లోకేష్, కార్తీక్, తదితర అభిమానులు పాల్గొన్నారు.

# హోసూరు జోన్

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ కేఎం సరయు

**హోసూరు(కృష్ణగిరి), జూన్ 12:** కార్మిక సంక్షేమం నైపుణ్యాభివృద్ధి శాఖ తరఫున కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కేఎం సరయు బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగం ప్రకారం విద్య, పిల్లల ప్రాథమిక హక్కు అని, 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ఏ విధమైన పనుల్లో నిమగ్నం చేయనని, పాఠశాలకు వెళ్లేలా ప్రోత్సహిస్తానని, సమాజంలో అవగాహన కల్పిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. తమిళనాడును బాలకార్మిక రహిత రాష్ట్రంగా మార్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంల్లో డిప్యూటీ కలెక్టర్ (సామాజిక భద్రతా పథకం) పన్నీర్‌సెల్వం, కార్మిక సంక్షేమశాఖ అసిస్టెంట్ కమిషనర్ (సామాజిక భద్రతా పథకం)జైశంకర్, కార్మిక సంక్షేమశాఖ అసిస్టెంట్ కమిషనర్ మాదశ్వరన్, అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో 124 మంది విద్యార్థుల చేరిక

**హోసూరు, జూన్ 12:** హోసూరు పరిధిలోని మూడో వార్డులో బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో చేరడానికి కొత్తగా 124మంది నమోదు చేసుకున్నారు. గతేడాది 135 మంది విద్యార్థులు ఎనిమిదో తరగతి పూర్తి చేసి తొమ్మిదో తరగతికి సమీపంలోని ఉన్నత పాఠశాలలో చేరారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 250 మంది విద్యార్థులను చేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థులను చేర్పిస్తున్నారు. కొత్త విద్యార్థుల నమోదు 124కి చేరుకుంది. వీరిలో 50 మంది ఒకటో తరగతిలో, చేరగా, 45 మంది విద్యార్థులు సమీపంలోని చిన్న ఎలసగిరి, శాంతపురం, మడివాళం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి ఆరో తరగతిలో చేరారు. మిగిలిన విద్యార్థులు వివిధ తరగతుల్లో చేరారు.

### 21న ట్రాన్స్‌జెండర్‌లకు ప్రత్యేక శిబిరం

**హోసూరు(కలెక్టర్), జూన్ 12:** కృష్ణగిరి జిల్లాలో ట్రాన్స్‌జెండర్ల కోసం ఈనెల 21న ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నారు. శిబిరంలో లింగమార్పిడి సంక్షేమ బోర్డుతో గుర్తింపు కార్డు నమోదు, ఆధార్ కార్డు సవరణ, ముఖ్యమంత్రి వైద్య బీమా పథకం, అయుష్మాన్ భారత్ కార్డు, ఓటరు కార్డు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. 21న కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

### కౌన్సిల్‌తో అదియమాన్ కళాశాల ఒప్పందం

**హోసూరు, జూన్ 12:** ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీతో హోసూరు అదియమాన్ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందించేందుకు ఒప్పందం కుదిరింది. అదియమాన్ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాథ్ ఇంటర్నేషనల్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ సరస్వతి, టెక్నాలజీ కౌన్సిల్ రెండూ ఎంఓయూపై సంతకాలు చేశారు. ప్రాజెక్టు ప్లేస్‌మెంట్‌ల్లో విద్యార్థులకు సహాయం చేయడానికి ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశామని కళాశాల నిర్వాహకులు తెలిపారు. కళాశాల ట్రస్టీ డాక్టర్ లాశ్య తంబిదురై సూచనతో రెండు సంస్థలు ఒప్పందం ప్రకారం పనిచేస్తాయని కూడా ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ హెడ్ డాక్టర్ వెంకటేశన్ సెల్వం, ఉపాధి విభాగం అధికారి డాక్టర్ కరుప్పస్వామి, ఐక్యూఏసీ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, స్ప్రింట్ గ్రూప్‌నకు చెందిన డాక్టర్ దీపక్‌పాలక్ష తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

# ప్రజా సమస్యలపై సత్వరం స్పందించాలి



అధికారులతో సమావేశమైన లోకాయుక్త అధికారి శశిధర్

**రాయచూరు, జూన్ 12 :** వివిధ అవసరాలు, సమస్యలపై పరిష్కారం కోరుతూ ప్రజలు ఇచ్చే దరఖాస్తులపై సంబంధిత అధికారులు తక్షణం స్పందించాలని జిల్లా లోకాయుక్త అధికారి శశిధర్ ఆదేశించారు. లోకాయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఫిర్యాదుదారులు తమ సమస్యలకు సంబంధించి 6 మాసాల క్రితం ఇచ్చిన దరఖాస్తులకు ఇప్పటి వరకూ స్పందన లేదని లోకాయుక్త అధికారి దృష్టికి తెచ్చారు. నీటి కొళాయి సరఫరా కోసం చేసిన దరఖాస్తు 7 నెలలుగా పెండింగ్‌లో ఉండగా వెంటనే కొళాయి కనెక్షన్ ఇవ్వాలంటూ కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో పాటు యక్లాస్‌పూర్‌కు చెందిన ఈశ్వర్ 371(జే)కు సంబంధించి ధ్రువపత్రం కోసం చేసిన దరఖాస్తు ఇప్పటికి పెండింగ్‌లో ఉందని ఫిర్యాదు చేయగా తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దేవదుర్గా తాలూకాలోని వాల్మీకి భవన నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు మూడు సార్లు ఎంబీలో రికార్డు చేసినా బిల్లులు చెల్లించడం లేదంటూ సంబంధిత కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయగా వారికి బిల్లులు మంజూరు చేయాలంటూ ఆదేశించారు.

## అదుపు తప్పి కారు బోల్తా.. గర్భిణి మృతి

**బంగారుపాళ్యం, జూన్ 12:** చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలోని మొగిలిఘాట్ దొరచెరువు వద్ద బుధవారం ఉదయం కారు అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో నాలుగు నెలల గర్భిణి మృతి చెందగా ఇద్దరికి స్వల్పగాయాలైన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు గుంటూరు జిల్లా గుజ్జనగుండ్ల బొజ్జరాయి వీధిలో నివాసముంటున్న ప్రకాష్ కుమార్, లక్ష్మిల కుమార్తె ఎస్.రాగ్నిజైత్రను గుంటూరు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన ప్రతాప్‌కు ఇచ్చి వివాహం చేశారు. ప్రతాప్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. భార్య రాగ్నిజైత్ర నాలుగు నెలల గర్భిణి కావడంతో వేలూరు సీఎంసీలో చెకప్ చేయించడానికి తన కారులో బెంగళూరు నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో మొగిలి ఘాట్ దొరచెరువు వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. వెనుకసీటులో కూర్చొని వున్న రాగ్నిజైత్ర (32) అక్కడికక్కడే మృతిచెందగా, ముందు సీటులో కూర్చొనివున్న ప్రతాప్, రాగ్నిజైత్ర తల్లి లక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సభా వేదిక వద్ద కోలాహలం



వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

# చంద్రబాబు అనే నేను..

# ప్రభంజనమై మేమూ..

## కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

### డబ్ల్యుబీ యీట్స్ (జయంతి)



ఐరిష్ కవిగా పేరొందిన విలియం బట్లర్ ఈట్స్ 1865 జూన్ 13న జన్మించారు. ఐర్లండ్ దేశానికి చెందిన ఆయన గొప్ప కవిగా, నాటక కర్తగా, రైటర్‌గా రాణించారు. 20వ శతాబ్దపు సాహితీ వేత్తలలో గుర్తింపు పొందారు. అబ్బే థియేటర్ ఏర్పాటులో సహకారం అందించారు. ఐరిష్ ఫ్రీ స్టేట్‌కు రెండుసార్లు సెనేటర్‌గా వ్యవహరించారు. 1923లో నోబెల్ సాహితీ పురస్కారం అందుకున్నారు. 1939 జనవరి 28న కన్నుమూశారు.

### ఈఎంఎస్ నంబూద్రిపాద్ (జయంతి)



కేరళ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఈఎంఎస్‌గా చిరపరిచితులైన ఏలాంకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్ 1909 జూన్ 13న మలప్పురం జిల్లా పెరింతాళ్‌మన్న తాలూకా ఏలాం కుళం గ్రామంలో జన్మించారు. 1957-59 మధ్య, తర్వాత 1967-69 మధ్య కూడా సీఎం అయ్యారు. కాంగ్రెస్ పార్టీయేతర కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ)కు చెందిన తొలి సీఎం కావడం విశేషం. కేరళ రాష్ట్రంలో సమాజంలో అధికారంలో ఆర్థిక వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యత కోసం ఎన్నో సంస్కరణలు తెచ్చారు. రచయితగా ఎన్నో రచనలు చేసి మళయాళ సాహిత్యంలో ఒక మైలురాయి తెచ్చారు. 1998 మార్చ్ 19న కన్నుమూశారు.

### దీపికా కుమారి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత దీపికా కుమారి 1994 జూన్ 13న బీహార్ రాష్ట్ర రాంచీ (ప్రస్తుతం జార్ఖండ్)లో జన్మించారు. విలు విద్య (ఆర్చెరీ)లో ప్రస్తుతం వరల్డ్ నెంబరు 9 ర్యాంకులో ఉన్నారు. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళా విభాగంలో బంగారు పతకం సాధించారు. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లోనూ పాల్గొన్నారు. అర్జున అవార్డు అందుకున్నారు. ఎఫ్ఐసీసీఐ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2014 అవార్డు అందుకున్నారు. 2016లో పద్మశ్రీ, 2017లో యంగ్ అచీవర్స్ అవార్డు పొందారు. 2021లో హుండై ఆర్చెరీ వరల్డ్‌కప్ లోనూ సత్తా చాటుకున్నారు. షాంఘైలో 2024 ఏప్రిల్ లో నిర్వ హించిన హుండై ఆర్చరీ వరల్డ్ సర్క్యూట్ పోటీల్లో పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**పావగడ, జూన్ 12 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో పావగడ కమ్మ సంఘం, బాలకృష్ణ అభిమానుల ఆధ్వర్యం లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు తదితర విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ప ట్టణంలోని బోవి కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థు లకు అందించినట్లు ఎన్‌టీకే సంఘం అధ్యక్షుడు గంగినేని దేవరాజు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



కంప్యూటర్లు అందజేత

**బాగేపల్లి, జూన్ 12:** బాగేపల్లి పట్టణంలోని పిఎంశ్రీ ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో కన్నడ, ఆంగ్ల మీడియంలు ఉన్నాయని ప్రైవేట్‌కు దీటుగా ఉన్న ఈపాఠశాలలో పిల్లలను చేర్పించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పిఎంశ్రీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం కోలారు, చిక్కబళ్ళాపుర పాల సమాఖ్య ఆధ్వర్యంలో కంప్యూటర్లు, ఇతర ఫర్నీచర్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల అభివృద్ధికి కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్ తదితర సౌలభ్యాలు ఉన్నాయని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ప్రస్తుతం స్మార్ట్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ, శౌచాలయాలకోసం పాలసమాఖ్య తగిన చేయూత ఇచ్చిందని అభినందించారు. కోలారు, చిక్కబళ్ళాపుర పాల సమాఖ్య డైరెక్టర్ వి మంజునాథరెడ్డి మాట్లాడుతూ రూ.15లక్షల ఖర్చుతో తరగతి గదులను బాగు చేయడమే కాక, ప్రధానోపాధ్యాయుల కార్యాలయాన్ని నిర్మించామన్నారు. తాలూకా ప్రతిభావంత విద్యార్థులకు ల్యాప్‌టాప్, 14 ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్‌లు సమకూర్చామన్నారు. విద్యార్థులు మొబైల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయితే వాటికి బానిసలు కారాదని అభిప్రాయపడ్డారు. చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. పాల సమాఖ్య శిబిరాధికారి డాక్టర్ గుర్రప్ప, మేనేజర్ డాక్టర్ బీ గౌతమ్, నాగరాజప్ప, మునిస్వామిరెడ్డి, బీఈఓ తనుజా, సమన్వయాధికారి వెంకటరామప్ప, విద్యాశాఖ అధికారులు బాలరాజు, పద్మావతి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌పై సాంకేతిక సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

**చింతామణి, జూన్ 12:** వ్యవసాయ విజ్ఞాన కేంద్రం, పట్టు విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం కురుబూరు చింతామణి ఆధ్వర్యంలో ఖరీఫ్‌పై సాంకేతిక సదస్సు నిర్వహించారు. బుధవారం ఏర్పాటైన సదస్సుకు బెంగళూరు జీకేవీకే సేంద్రియసాగు శాస్త్రవేత్త డాక్టర్ మూలడగిరియప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చింతామణి విభాగం వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజుళ ప్రసంగిస్తూ వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. నైరుతి వర్షాలు ప్రారంభం కావడంతో దుక్కులు ఆరంభమయ్యాయన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు పండించాలన్నారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం సీనియర్ అధికారి డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విత్తనశుద్ధి ఆవశ్యకతను వివరించారు. డాక్టర్ సంధ్యా, డాక్టర్ ఎన్ గంగరాజు తదితరులు నూతన వంగడాల గురించి వివరించారు. కీటకశాస్త్ర విభాగం ప్రాధ్యాపకులు డాక్టర్ మంజునాథ్ అధ్యక్షత వహించారు. సదస్సులో నూతన వంగడాలు, పర్యావరణస్నేహి సాంకేతిక పరిజ్ఞానం ప్రదర్శించారు. కార్యక్రమంలో 200మందికిపైగా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుణాత్మక విద్యను అందించాలి



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

**శిడ్లఘట్ట, జూన్ 12:** పిల్లలకు గుణాత్మక విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని కొన్ని గ్రామీణ ప్రాంతాలలో అలాంటి విద్యకోసం సంఘసంస్థలు, ట్రస్టులు ముందుకు వస్తున్నాయని విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ బైలాంజనప్ప అభిప్రాయపడ్డారు. తాలూకాలోని అంకతట్టిగేట్ సమీపాన ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలను పాఠశాలలకు పంపడం తల్లిదండ్రుల బాధ్యత అని అలాగే వారి చదువుపట్ల దృష్టి సారించాలన్నారు. పిల్లల ప్రగతి గురించి ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. పిల్లల విద్యపట్ల ఉపాధ్యాయులు కూడా చొరవ చూపడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లలకు ఆస్తులు కంటే మంచి విద్య అందించడం ముఖ్యమన్నారు. రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ పాఠాలకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బీఈఓ నరేంద్ర కుమార్, ప్రైవేట్ పాఠశాలల పాలకవర్గ మండలి సమాఖ్య అధ్యక్షుడు విజ్ఞం నాగరాజ్, సమాజసేవకుడు బిదరహళ్ళి నాగరాజ్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ముఖ్యులు కేపీ ప్రకాశ్, వినుతా ప్రకాశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మొక్కలను పెంచాలి

**చేళూరు, జూన్ 12:** తాలూకాలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఉపాధ్యాయులు చొరవ చూపారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు ఆసక్తి చూపారు. పచ్చదనం పెంచడంతోపాటు ఔషధమొక్కలు నాటేలా అటవీశాఖ అధికారులు తగిన చొరవచూపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వఖాళీ స్థలాల్లో ప్రస్తుత సీజన్‌లో మొక్కలు నాటేందుకు తగిన చర్యలు తీసుకోవడం సముచితమని అంటున్నారు. పర్యావరణ పరిరక్షణపై మరింత జాగృతి అవసరమన్నారు.

## ఇ-లర్నింగ్ ప్రొఫెసర్లకు డిమాండ్



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్లు

**బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి):** మారుతున్న సాంతికతకు అనుగుణంగా ప్రస్తుతం ఇ-లర్నింగ్ ప్రొఫెసర్‌లకు డిమాండ్ పెరుగుతోందని డాక్టర్ పార్వవి అభిప్రాయపడ్డారు. సాంకేతిక విషయాలను నేర్చుకోవడం ద్వారా సంప్రదాయక, మానసిక, శారీరక, సామాజిక, భావనాత్మక అంశాలను తెలుసుకోవచ్చునన్నారు. నగరంలోని శ్రీకృష్ణ కళాశాలలో ట్రాన్సెండింగ్ టెక్ ఎడ్ నెక్సస్ అడ్వాన్సింగ్ ఎడ్యుకేషన్ త్రూ టెక్నలాజిక్ ఇంటిగ్రేషన్ అనే అంశంపై జాతీయ సదస్సు బుధవారం జరిగింది. పాండిచ్చేరి సెంట్రల్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు, డైరెక్టర్ అయిన టి సుబ్రమణ్యం నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆర్ఎన్ఎస్ఐటి విద్యాసంస్థ ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ బోజణ్ణ, ఎంఎస్ఆర్ఐటి సంస్థ సహ ప్రాధ్యాపకులు డాక్టర్ పార్వవి గౌరవ అతిథులుగా విచ్చేయగా శ్రీకృష్ణ విద్యాసంస్థ సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం రుక్మాంగదనాయుడు అధ్యక్షత వహించారు. అమెరికాలోని శిరిడాన్ సిజిఎన్ విశ్వవిద్యాలయం అధ్యక్షులు డాక్టర్ నాగరాజన్ శ్రీనివాస్ తదితరులు సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. పలుకళాశాలల నుంచి 50మందికిపైగా విద్యార్థులు పత్రాలు సమర్పించగా డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నటుడు దర్శన్ సహా ఐదుగురి విచారణ



పోలీసుల అదుపులో దర్శన్

**బెంగళూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి):** కస్టడీలో ఉన్న ప్రముఖ సినీ నటుడు దర్శన్ సహా నిందితులను పోలీసులు విచారిస్తున్నారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో పలు కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. పవిత్రగౌడకు మర్మాంగం ఫొటో పంపాడనే కారణంతో అక్కడే కొట్టి హత్యచేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఫిబ్రవరి 27న రేణుకా స్వామి మొబైల్ నుంచి పవిత్రగౌడకు అశ్లీల మెసేజ్‌లు పంపడం ప్రారంభమైందని ప్రతిరోజూ ఇలాంటివే పంపే వాడని తెలుస్తోంది. అతడి వాట్సప్ బ్లాక్ చేస్తే ఇతర సోషల్‌మీడియా ద్వారా పంపినట్టు తెలుస్తోంది. ఇదే ఆగ్రహంతోనే చితకబాదినట్టు తెలుస్తోంది. మరోవైపు దర్శన్ నటిస్తున్న నాలుగు సినిమాలపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు తెలుస్తోంది. సంబంధిత దర్శక, నిర్మాతలు అయోమయంలో పడ్డారు. కాగా దర్శన్ కుటుంబంలోనూ విబేధాలు తారస్థాయికి చేరుతున్నట్టు తెలుస్తోంది. పవిత్ర విష యంలో ఇప్పటికే దర్శన్, భార్య విజయలక్ష్మిల మధ్య గొ డవలు చెలరేగాయి. ఇదే కారణంతో భార్య తీవ్రమైన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమ వుతు న్నట్టు తెలుస్తోంది. ఈ కేసులో దర్శన్ ఇప్పట్లో బయట పడడం సాధ్యం కాదని తెలుస్తోంది. మంగళవారం రాత్రి పోలీస్ కస్టడీలో ఉన్న దర్శన్ బిరియాని అడిగినట్టు తెలుస్తోంది. బుధవారం దర్శన్, పవిత్రతోపాటు ఇతర నిందితులను కామాక్షిపాళ్యలోని సంఘటనా స్థలానికి తీసుకొచ్చి పంచనామా చేశారు.